# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | గురువారం 10 సెప్టెంబర్ 2026





## ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌కు మధుయాష్కీ శుభాకాంక్షలు

- ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవ చేయాలి
- ఎల్‌బీనగర్‌లో మర్యాదపూర్వక కలయిక

**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో అనిల్‌కుమార్ యాదవ్ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యలు తీర్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొల్లూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సండే సంతలో.. మత్తు దందా!




- కూరగాయల మార్కెట్, ఫైలాన్ పార్క్ వద్ద విక్రయాలు జరుగుతున్నట్లు ప్రచారం
- బర్త్‌డే పార్టీల్లో ప్రధాన డిష్‌గా గంజాయి.. ఆందోళనలో తల్లిదండ్రులు
- ఖాకీలు నిఘా పెంచాలని చౌటుప్పల్ వాసుల విజ్ఞప్తి

2

**తొలివెలుగు, చౌటుప్పల్:** "వారం వారం వచ్చే సంత కాయగూరల కొనుగోలుకే కాదు.. మత్తు పదార్థాల అక్రమ విక్రయాలకూ అడ్డాగా మారుతోందా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది చౌటుప్పల్ పట్టణంలో. వ్యాపార, పారిశ్రామిక హబ్‌గా మారిన చౌటుప్పల్‌లో గంజాయి క్రయవిక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నాయన్న ప్రచారం స్థానికంగా ప్రకంపనలు సృష్టిస్తోంది.

**జనసమ్మర్ధమే ఆసరా!**

చౌటుప్పల్‌లోని కూరగాయల మార్కెట్, ఫైలాన్ పార్క్ పరిసర ప్రాంతాల్లో గంజాయి దందా సాగుతున్నట్లు స్థానికుల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ప్రతి ఆదివారం జరిగే వారపు సంతకు గ్రామాల నుంచి జనం పోటెత్తుతారు. ఈ కిక్కిరిసిన రద్దీని ఆసరాగా చేసుకుంటున్న మత్తు వ్యాపారులు కొనుగోలుదారులకు గంజాయి ప్యాకెట్లను సమకూరుస్తున్నట్లు తెలుస్తోంది. పార్కులు, నిర్మానుష్య ప్రదేశాలు ఈ విక్రయాలకు వేదికలుగా మారుతున్నాయని, గంజాయి ప్రియులకు ఇది అనువైన కేంద్రంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి.

**వేడుకల్లో మత్తు చిత్తు!**

ఈ గంజాయి మహమ్మారి కేవలం పట్టణానికే పరిమితం కాకుండా పల్లెలకూ పాకుతోంది. ముఖ్యంగా గల్లీల్లో జరిగే బర్త్‌డే పార్టీలు, మిత్రుల విందుల్లో గంజాయి ప్రధాన వినోదంగా మారుతోందన్న వార్తలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అలవాటుగా మారి వ్యసనంగా పరిణమిస్తుండటంతో పలువురు విద్యార్థులు, యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**ఉక్కుపాదం మోపాల్సిందే!**

గంజాయి సంస్కృతిని ఆరంభంలోనే తుంచేయకపోతే శాంతిభద్రతలకు విఘాతం కలగడమే కాకుండా నేరాల సంఖ్య పెరిగే ప్రమాదముంది. పోలీసు, ఎక్సైజ్ అధికారులు తక్షణమే స్పందించి ఆదివారం సంత రోజు ప్రత్యేక నిఘా బృందాలతో తనిఖీలు చేపట్టాలని చౌటుప్పల్ ప్రజలు కోరుతున్నారు. అక్రమ విక్రయదారుల గుట్టు రట్టు చేసి, యువత భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలి

- రెడ్డి సామాజిక వర్గంపై వ్యాఖ్యలపై సంఘం నాయకుల ఆగ్రహం
- పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు.. అనంతరం నిరసన
- వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్

2




## అణచివేతపై అక్షరాస్త్రం.. కాళోజీ కవిత్వం

- రాజాపేటలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం
- నెమిల ప్రాథమిక పాఠశాలలో కాళోజీ 112వ జయంతి వేడుకలు
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు రాజుకు ఘన సన్మానం

2

# అణచివేతపై అక్షరాస్త్రం.. కాళోజీ కవిత్వం

**తొలివెలుగు, రాజాపేట:** సమసమాజ నిర్మాణం కోసం ప్రజల గొంతుకగా నిలిచిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని నెమిల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెమిల భరత్‌కుమార్ అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పాఠశాలలో కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ.. 'పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిదే' అనే సందేశంతో జీవితాంతం ప్రజల కోసం కృషి చేసిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ఆయన రచనలు ప్రజల్లో చైతన్యాన్ని నింపడంతో పాటు అన్యాయం, అణచివేతపై ప్రశ్నించే ధైర్యాన్ని కల్పించాయని అన్నారు. 'నా గొడవ' కవితా సంపుటి ద్వారా సాహిత్య రంగంలో విశిష్ట గుర్తింపు పొందిన కాళోజీ జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం శుభపరిణామ మన్నారు.




న్యాయవాదిగా సేవలందిస్తూనే తన రాజకీయ వ్యంగ్య కవిత్వంతో సామాజిక సమస్యలను ఎత్తిచూపిన ప్రజా వైతాళికుడిగా కాళోజీ నిలిచిపోయారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పలుగుల రాజును ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు కాళోజీ రచించిన కవితలను గానం చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంత్రి నగేష్, రజిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కష్టాలు తీర్చకపోతే వలసలే శరణ్యం!

- **లో–వోల్టేజ్‌తో పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన**
- **రాజాపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో**
- **విద్యుత్ సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక**



**తొలివెలుగు, రాజాపేట :** వ్యవసాయ బావులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు, రైతులు బుధవారం రాజాపేటలోని మహాత్మాగాంధీ చౌరస్తాలో భారీ రాస్తారోకో నిర్వహించారు. పాముకుంట గ్రామ రైతులు ప్రారంభించిన ఈ నిరసనకు మండలంలోని పలు గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపారు.bఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయ బావుల వద్ద తీవ్ర లో–వోల్టేజీ సమస్య కారణంగా విద్యుత్ మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ వోల్టేజీ హెచ్చుతగ్గులకు గురికావడంతో మోటార్లు కాలిపోతున్నాయని, వాటి మరమ్మతులు, కొత్త మోటార్ల కొనుగోలుతో అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోయారు.

రోజుకు కనీసం ఏడు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే సాగులో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, చివరకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనకారులు ప్లకార్డులు చేతబట్టి సుమారు రెండు గంటల పాటు రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం పోలీసులు, అధికారులు పరిస్థితిని చక్కదిద్దారు. కార్యక్రమంలో జలసాధన సమితి కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎద్ల బాలలక్ష్మి, మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు రంగ సంతోష్, ఎద్ల నరేష్‌రెడ్డి, రంగ నరేష్, జన్నపల్లి చంద్రారెడ్డి, బచ్చలి శేఖర్, గుంటి అశోక్, చిక్కా వెంకటేష్, రంగ దశరథ, గొడుగు రాజు, కాకల నవీన్, వెంకటపురం రమేష్, ములుగు సోమలింగం, మర్ల నాగరాజు, పారుపల్లి సంజీవరెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వేముల పుష్ప

- **జెవాజి శ్రీకాంత్ వివాహ వేడుకకు హాజరైన ప్రజా గాయిని**

**తొలివెలుగు, రామన్నపేట :** మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జెవాజి శ్రీకాంత్ వివాహ వేడుకకు ప్రజా గాయిని, ఉద్దీపన ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ వేముల పుష్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన దంపతులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. నూతన దంపతులకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కూడా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరొద్దీన్, నాయకులు గుత్తా నర్సిరెడ్డి, జినుకల ప్రభాకర్, రాయిని రమేష్, ఎం.డి. అక్రం, శంభుల వెంకన్న, కృష్ణ, సంతోష్, నోముల ప్రవీణ్, గట్టు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలి

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరిచేలా అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ రెడ్డి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం భూదాన్ పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు పత్రాన్ని అందజేసి, అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు మాట్లాడుతూ.. క్యూ న్యూస్ వేదికగా తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కులాల మధ్య వైషమ్యాలను పెంచేలా, ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక వాతావరణంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా, సామాజిక సామరస్యానికి విఘాతం కలిగించేలా జరిగే ప్రచారాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి వ్యాఖ్యల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను రెడ్డి సంఘం నాయకులు కోరారు. సామాజిక వర్గాల మధ్య పరస్పర గౌరవం, సామరస్యాన్ని కాపాడేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు కొమురెల్లి రామచంద్రారెడ్డి, కొమురెల్లి బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సామల రాజిరెడ్డి, సహాయ కార్యదర్శి మద్ది మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి బోయపల్లి శశిధర్‌రెడ్డి, నాయకులు నగ్గ మల్లారెడ్డి, మద్ది చంద్రారెడ్డి, మేకల చొక్కారెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

- **రామన్నపేటలో ముగిసిన మండలస్థాయి క్రీడా ఎంపికలు**



**తొలివెలుగు, రామన్నపేట:** మండల స్థాయి క్రీడా ఎంపికల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజేతలుగా నిలవాలని ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాసు విక్రమ్ ఆకాంక్షించారు. మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంద్రపాలనగరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఎంపిక పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ విక్రమ్, ఎంఈవో సురేందర్‌రెడ్డి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. క్రీడాకారులు సాధనతో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. క్రీడాకారులకు రెండు రోజుల పాటు భోజన వసతి కల్పించిన సర్పంచ్‌కు ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె. శేఖర్, బీఆర్ఎస్ నాయకుడు మందడి శ్రీధర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పెద్దబోయిన మణి, సరోజ, రేణుక, కొండ సాయి, చందు, కల్పన పాల్గొన్నారు.

# అరకొర జీతాలతో పొట్ట గడిసేదెలా ?

- గ్రామ పంచాయతీ కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలి
- అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శికి సీఐటీయూ వినతి
- నెల రోజుల్లో పరిష్కరించకపోతే ఆందోళన: వర్కల బాలరాజు గౌడ్



**తొలివెలుగు, అబ్దుల్లాపూర్‌మెట్:** గ్రామ పంచాయతీ కార్మికులకు అరకొర వేతనాలు చెల్లిస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల్లో కొందరికి నెలకు రూ.5 వేలు, మరికొందరికి రూ.4 వేలు మాత్రమే వేతనంగా ఇస్తున్నారని మండిపడ్డారు. కేవలం ఎనిమిది మందికి మాత్రమే రూ.9,500 అందుతోందని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ వర్కల బాలరాజు గౌడ్, నాయకుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ.. గ్రామాల పారిశుద్ధ్య నిర్వహణలో కీలకంగా పనిచేస్తున్న కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించడం సరికాదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.9,500 వేతనాన్ని కార్మికులందరికీ సమానంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లోగా సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్మికులు వానమ్మ, యాదమ్మ, మహంకాళి, మైసయ్య, కృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులంటే కేసీఆర్‌కు అంత చిన్నచూపా ?

- ఫామ్‌హౌస్ వద్ద పసుపు నీళ్లు చల్లడంపై కాంగ్రెస్ ఆగ్రహం
- కేసీఆర్, కేటీఆర్ క్షమాపణ చెప్పాలని నోముల ప్రవీణ్ డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్‌ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ వద్ద ఆందోళన చేపట్టిన దళితుల పాదముద్రలను పసుపు నీళ్లతో శుభ్రం చేయడం తీవ్రంగా నిరసించదగినదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు నోముల ప్రవీణ్ అన్నారు. బుధవారం రామన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆందోళనకారులు వెనుదిరిగిన అనంతరం వారు నడిచిన ప్రాంతాలను పసుపు నీళ్లతో కడిగినట్లు సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు నిజమైతే, అది రాష్ట్రంలోని దళిత సమాజం మొత్తాన్ని ఘోరంగా అవమానించడమేనన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించడం సరికాదన్నారు. గతంలో దళిత ముఖ్యమంత్రి, దళితబంధు అని మోసం చేసిన కేసీఆర్.. ఇప్పుడు దళితుల పట్ల తనకున్న చిన్నచూపును మరోసారి బయటపెట్టుకున్నారని విమర్శించారు. ఈ ఘటనపై కేసీఆర్, కేటీఆర్ వెంటనే దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# నిరసన హక్కునూ కాలరాస్తారా ?

- చిట్యాలలో బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు
- ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం: బీఆర్‌ఎస్ నేతలు



తొలివెలుగు, చిట్యాల: అసెంబ్లీ ముట్టడికి బీఆర్‌ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో చిట్యాల మండల పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు బుధవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్టు చేశారు. నాయకులు హైదరాబాద్‌కు వెళ్లకుండా వారి ఇళ్ల వద్దే పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు తమ గళాన్ని వినిపించకుండా ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కుతూ ప్రభుత్వం నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోందని మండిపడ్డారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించే నిరసన కార్యక్రమాలకు అనుమతించాలని, అరెస్టుల ద్వారా తమ ఉద్యమాలను అడ్డుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో కౌన్సిలర్ నిమ్మనగోటి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు బొబ్బల శివశంకర్‌రెడ్డి, షేక్ అజీమ్, ఆగు అశోక్, పొన్నం లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

# ఒత్తిడిని జయించేందుకు ధ్యానం ఏకైక మార్గం

- భూదాన్ పోచంపల్లిలో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానోత్సవం ప్రారంభం
- మానసిక ప్రశాంతతకు ధ్యానమే మార్గం: ఎన్‌వీ కృష్ణారావు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఆధునిక సమాజంలో పెరిగిపోతున్న తీవ్ర ఒత్తిడిని జయించి, మనశ్శాంతి పొందేందుకు ధ్యానమే సరైన మార్గమని రామచంద్ర మిషన్ వక్త ఎన్వి కృష్ణారావు తెలిపారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని డైహౌస్ హాల్‌లో హార్ట్ ఫుల్ నెస్, రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో బుధవారం మూడు రోజుల ధ్యానోత్సవ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మండల పరిషత్ అధికారి విజయ, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవ్ కుమార్‌తో కలిసి కృష్ణారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హృదయ ఆధారిత ధ్యానం ప్రతి ఒక్కరి జీవితంలో మంచి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. శంషాబాద్ సమీపంలోని కణహ శాంతి వనంలో సుమారు 1,000 ఎకరాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దాదాపు 160 దేశాల్లో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం విస్తరించిందని తెలిపారు. ప్రజలంతా ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని కోరారు. అనంతరం పట్టణ ప్రజలతో ధ్యానం నిర్వహించి, ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ ఇన్చార్జి రామ్, మాజీ ఎంపీపీ సారా సరస్వతి, చేనేత సంఘం ప్రతినిధులు అంకం పాండు, కోడి బాలరాజు, ప్రభాకర్, సోమేశ్వరి, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక ఇబ్బందులతో బావిలో దూకి మహిళ ఆత్మహత్య

**మల్యాల:** ఓ మహిళ.. తన కుమారుడుతో కలిసి బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులో జరిగింది. స్థానికులు కవిత(35) మృతదేహాన్ని బయటకు తీశారు. ఆమె కుమారుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులతోపాటు తన చిన్నకుమారుడు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం

- ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మ దహనం
- పదవి నుంచి బర్తరఫ్ చేయాలి: కౌన్సిలర్ కొండమడుగు ఎల్లస్వామి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** దళిత వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలను పదవుల నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని కౌన్సిలర్ కొండమడుగు ఎల్లస్వామి డిమాండ్ చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఎమ్మార్పీఎస్ పట్టణ శాఖల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎల్లస్వామి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు నియంతల్లా వ్యవహరిస్తూ ఉన్నత పదవిలో ఉన్న దళిత నేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు పోతగల శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు కుక్క అరుణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇట్ట ముని మహేష్ యాదవ్, కుక్క స్వామి, కుక్క కుమార్, జింకల జయసూర్య, కుక్క శ్రీకాంత్, కొమ్ము సందీప్, భాను, ధనముని శివ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై ఎమ్మెల్యే ఐలయ్య వ్యాఖ్యలు దురదృష్టకరం

- అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలి
- రాజాపేట ఎస్ఐకి బీఆర్ఎస్ నాయకుల వినతి
- లేకుంటే చట్టపరమైన చర్యలని హెచ్చరిక



**తొలివెలుగు, రాజాపేట:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాజాపేట ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ తదితరులు మాట్లాడుతూ.. దళితులకు కేసీఆర్ అన్యాయం చేశారంటూ ఎమ్మెల్యే ఆరోపించడం సరికాదన్నారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ వద్ద 'చావు డప్పు కొట్టాలి' అని మాట్లాడటం బాధ్యతాయుత శాసనసభ్యుడికి తగదని, ఇటువంటి మాటలు హింసను ప్రోత్సహించేలా ఉన్నాయని మండిపడ్డారు. దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు తీసుకొచ్చిన నేతపై అసెంబ్లీ సాక్షిగా అనుచిత పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమన్నారు. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పకపోతే చట్టపరంగా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎడ్ల బాలలక్ష్మి, సందిల భాస్కర్‌గౌడ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, ఎర్రగోకుల జశ్వంత్, మర్ల నాగరాజు, గుర్రం నర్సింహులు, ఎడ్ల నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

- ప్రజా చైతన్యానికి కాళోజీ రచనలు స్ఫూర్తిదాయకం



**తొలివెలుగు, చిట్యాల:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కాటం వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాళోజీ రచనలు ప్రజల్లో చైతన్యాన్ని నింపడంతోపాటు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని పెంపొందించాయని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక చైతన్యం కోసం ప్రజాకవి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కాళోజీ తన జీవితాంతం సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాడారని తెలిపారు.

కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కృష్ణయ్య, ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, వార్డు సభ్యులు జిల్లా ప్రశాంత్, ఏర్పుల మహేశ్వరి వెంకన్న, ఆనగంటి నరేష్, గంట్ల తిరుమలరెడ్డి, నీలకంఠం నరేష్, గంట్ల పుల్లారెడ్డి, శిరస్సు సైదులు, తోటకూరి బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో నాయకుల ముందస్తు అరెస్టు

- బకాయి బిల్లులు చెల్లించకుండా అరెస్టులు చేయడం హేయమైన చర్య: గుంటి మధుసూదన్‌రెడ్డి

**తొలివెలుగు, రాజపేట:** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం పిలుపు మేరకు అసెంబ్లీ



ముట్టడికి వెళ్తున్న పలువురు నాయకులను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేశారు. బకాయి బిల్లులు చెల్లించకుండా ఆందోళనకు వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడం సరికాదని పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచులకు సంబంధించిన బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ అరెస్టులను మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు పల్లె సంతోష్‌గౌడ్, కర్ణాకర్‌రాజు, పలువురు మాజీ సర్పంచులు ఖండించారు. టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, ఉపాధ్యక్షుడు మొలుగు సోమలింగం తదితరులు పోలీసుల తీరును ఖండించారు.

# మూడు రోజులైనా ప్రజాసమస్యలపై చర్చించాలి

**బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు**

**హైదరాబాద్:** శాసనసభ, మండలి సమావేశాల్లో కాంగ్రెస్, భారాస సభ్యులు ప్రజాసమస్యలను గాలికొదిలేసి వీధి నాటకాలకు తెరలేపారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మండిపడ్డారు. సమస్యలపై చట్టసభల్లో చర్చిస్తారనే ప్రజల ఆశలను వమ్ము చేస్తూ రాజకీయ ప్రయోజనాలకు, వ్యక్తిగత దూషణలకు వినియోగించుకోవడం శోచనీయమని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "ప్రజాసమస్యలపై భాజపాకు నిత్యం వేల అర్జీలు అందుతున్నాయి. రూ.వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, వివాదాస్పద 22ఏ అంశం, ఉద్యోగులకు పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలుతోపాటు ఆర్థిక, సామాజిక సంక్షోభాలపై సభలో చర్చించాల్సిన అత్యవసర పరిస్థితి ఉంది. పదేళ్ల భారాస పాలనలోని అరాచకాల నుంచి విముక్తిని, మార్పును కోరుకుని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే.. ఆ పార్టీలానే ప్రజాద్రోహ విధానాలను కాంగ్రెస్ అవలంబిస్తోంది. తమ వైఫల్యాలు బయటపడకుండా ఉండేందుకు రెండు పార్టీలూ అసెంబ్లీని పక్కదోవ పట్టిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఏ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ భాజపా ఇచ్చిన వాయిదా తీర్మానాలు చర్చకు రాకుండా కాంగ్రెస్, భారాస అడ్డుకుంటున్నాయి. మిగిలిన మూడు రోజులైనా ప్రజాసమస్యలపై చర్చించాలి'' అని డిమాండ్ చేశారు.

**రాహుల్‌గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ**

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని రాహుల్‌గాంధీకి రామచందర్‌రావు ఇంగ్లిష్‌తో పాటు ఇటాలియన్ భాషలో లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించి సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో విద్యాసంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కళాశాలల నిర్వహణ సైతం గాడి తప్పిందని.. అధ్యాపకులకు సరైన వేతనాలు ఇవ్వలేకపోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల పక్షాన భాజపా నిరసనలు తెలిపితే ప్రభుత్వం అరెస్ట్‌లకు పాల్పడుతోందని ఆరోపించారు.

**కులాల మధ్య అంతరం పెంచేలా మాట్లాడటం మంచిది కాదు: వెంకటరమణారెడ్డి**

కులాల మధ్య అంతరాన్ని పెంచే విధంగా అసెంబ్లీలో కాంగ్రెస్, భారాస సభ్యులు మాట్లాడుతున్నారని, ఇది మంచిది కాదని భాజపా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'సభలో మూడు రోజులుగా ఒక్క చర్చా లేదు. ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. వ్యక్తిగత ద్వేషాలతో సభను జరగనివ్వడం లేదు. పోలీసులను ఇబ్బందికి గురిచేయడం తప్పు. భారాస సభ్యులు రోడ్డుపై అర్ధనగ్న ప్రదర్శన చేసి ఏం సందేశం ఇస్తున్నట్లు? సభలో లేని వ్యక్తులను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నా' అని పేర్కొన్నారు.